

అతలాకుతలం
కొల్లేరు వరద ఉధృతితో ఆకివీడు మండలం అతలాకుతలమైంది. వేల **ఎకరాల్లో పంట నీటమునగగా, లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి.** 8లో ▸



పంట బోదెలోకి కాలేజీ బస్సు
శ్రీ చైతన్య జూనియర్ కళాశాల బస్సు మంగళవారం ఉదయం పాలకొడేరు వద్ద పంటబోదెలోకి దూసుకుపోయింది. 11 మందికి స్వల్ప గాయాలయ్యాయి. 8లో ▸



కొత్త రోడ్లు దేవుడెరుగు..
వర్షాలకు ఏలూరులోని రోడ్లన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. నగరంలోని ప్రధాన రహదారులన్నీ పెద్ద పెద్ద గోతులతో ప్రమాదకరంగా మారాయి. 8లో ▸

న్యూస్‌రీల్

నేడు ఆకివీడుకు సీఎం చంద్రబాబు
ఆకివీడు: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం ఆకివీడు మండలం దుంపగడప వద్ద ఉన్న ఉప్పుటేరును పరిశీలిస్తారు. హెలికాప్టర్‌లో ఆకివీడుకు వచ్చి.. అక్కడి నుంచి ఐ.భీమవరం మీదుగా రోడ్డు మార్గంలో దుంపగడప చేరుకుంటారు. కొల్లేరు వరద ముంపు నేపథ్యంలో.. ముంపు నీటిని త్వరితగతిన సముద్రంలోకి పంపించే ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం ఆకివీడు చేరుకుని అక్కడ నుంచి కాకినాడ జిల్లా సామర్లకోటకు వెళ్తారు.

పార్టీలకతీతంగా సేవలందించాం




తూర్పుపాలెంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: వైఎస్సార్‌సీపీ పాలనలో పార్టీలకతీతంగా ప్రజలకు సేవలందించామని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం తూర్పుపాలెంలో జరిగిన ఎంపీటీసీలు, సర్పంచుల సమావేశంలో పాల్గొన్నారు. కూటమి పాలన నేడు భిన్నంగా సాగుతుందన్నారు. వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఏనాడూ ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను ఇబ్బందులు పెట్టలేదన్నారు. కూటమి నాలుగు నెలల పాలనలో ఇచ్చిన ఏ హామీని నెరవేర్చలేదన్నారు. సాకులు వెతుకుతూ ముందుకు సాగుతున్నారన్నారు. ప్రజలకు అర్థమయ్యాక వ్యతిరేకతను ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. ప్రతి కార్యకర్తకు, నాయకుడికి అండగా ఉంటామని, అందరూ ఐక్యంగా ప్రజా సమస్యలపై పోరాటం చేద్దామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీలు పుతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), సబ్బితి సుమంగళి, జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, పోడూరు మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు గుబ్బల ఉషారాణి బ్రహ్మం, ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, ఏపీ సీడ్స్ మాజీ డైరక్టరు పోతుమూడి రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అవకతవకలపై కఠిన చర్యలు
భీమవరం అర్బన్: పేదలకు అందించాల్సిన రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. భీమవరం మండలంలోని రాయలంలో మంగళవారం రేషన్ షాపు నెం 54ను, ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనంలో అదనంగా ఉన్న పంచదార నిల్వలలో తేడా గమనించి వాహన ఆపరేటర్, షాపు నిర్వాహకుడిపై కేసు నమోదుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రావి రాంబాబును జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

విద్యార్థుల అభిరుచి మేరకు బోధించాలి



అపుస్మా నాయకులతో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

తాడేపల్లిగూడెం: విద్యార్థుల అభిరుచి మేరకు బోధించి వారిని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలపాల్సిన గురుతరమైన బాధ్యత ఉపాధ్యాయుల భుజస్కంధాలపై ఉందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పిలుపునిచ్చారు. పట్టణంలోని శశి ఇంజనీరింగ్ కళాశాలలో అపుస్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జిల్లా సర్వసభ్యసమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బూరుగుపలి వేణు గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, జనరల్ సెక్రటరీ తులసీ ప్రసాద్, అదనపు సెక్రటరీ ఎంబీఎస్ శర్మ, జోనల్ అధ్యక్షుడు జంగా బాలాజీ, జిల్లా అధ్యక్షుడు పాపారావు నాయుడు, సుబ్బరాజు, మేకా నరేంద్ర కృష్ణ, ఆదిత్య, తిరుమల సంస్థల అధినేతలు శేషారెడ్డి, నున్న తిరుమల రావు తదితరులు పాల్గొన్నారు.

లాభసాటి వంగడాలు సృష్టించాలి
ఉండి: శాస్త్రవేత్తలు విశేష కృషి చేసి లాభసాటి వంగడాలు సృష్టించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకేలో పరిశోధనలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు మేలైన వంగడాలు అందించాలన్నారు.

బిక్కు బిక్కుమంటూ..

- జగదిగ్బంధంలో కొల్లేరు లంక గ్రామాలు
- పడవలపై ప్రమాదకరంగా ప్రయాణాలు
- నిత్యావసరాలు అందక ప్రజల ఇక్కట్లు

కైకలూరు: కొల్లేరు ఉగ్రరూపం దాల్చింది. కొల్లేరు పరీవాహక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. గ్రామాలు ముంపులో చిక్కుకోవడంతో నిత్యావసరాలు లేక ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. కనీసం మంచినీరు కూడా సరఫరా చేయడం లేదని ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోస్తున్నారు. సాధారణంగా వరదలు తగ్గుముఖం పట్టిన తర్వాత ఎగువ నుంచి చేరే నీటితో కొల్లేరు ఉగ్రరూపం దాల్చుతుంది. కొల్లేరు సరస్సులోకి వరదల సమయంలో లక్షా 10 వేల క్యూసెక్కుల నీరు చేరుతోంది. ఇందులో కేవలం 12,000 క్యూసెక్కుల నీరు ఉప్పుటేరు ముఖద్వారం ద్వారా సముద్రానికి చేరుతోంది. మధ్యలో అనేక ఆక్రమణల వల్ల ఎగువ నుంచి వచ్చిన నీరు వెనక్కి మళ్లుతోంది. కొల్లేరులోకి చేరే నీటిని బయటకు పంపించే పెదఎడ్లగాడి వంతెన వద్ద నీటి మట్టం మంగళవారానికి 3.42 మీటర్లకు చేరింది. నీటి మట్టం 4 మీటర్లకు చేరితే కొల్లేరు గ్రామాలతో పాటు సమీప పంట పొలాలు సైతం నీట మునుగుతాయి. ఈ సమయంలో వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతుందని ఆందోళన చెందుతున్నారు.



పెదఎడ్లగాడి నుంచి పెనుమాకలంక గ్రామానికి చేరడానికి పడవ కోసం బారులు తీరిన ప్రజలు

కొల్లేరు ప్రజలకు అందని సాయం
వారం రోజులకు పైగా ముంపు నీటిలో మునుగుతున్న కొల్లేరు గ్రామాలకు అధికారులు నిత్యవసరాలు అందించడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాప్రతినిధులు తూతూమంత్రంగా గ్రామాలను సందర్శించి వెళ్ళడం మినహా మా అవసరాలను పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. మండవల్లి మండలం పెనుమాకలంక గ్రామస్తులకు నిత్యావసరాలు ఇప్పటికీ చేరలేదు. ముంపు నీరు చేరిన గ్రామాలను గుర్తించడంలోనూ గ్రామ పెద్దలు, రెవెన్యూ సిబ్బంది మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ముంపు బారిన పడిన ఇంటితో సంబంధం లేకుండా మొత్తం గ్రామానికి సాయం అందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అంతా కొల్లేరు మయం.. ఇప్పటికే మండవల్లి మండలం పెనుమాకలంక, నందిగామలంక, శ్రీరామనగర్, కొవ్వాడలంక, పులపర్రు, నుచ్చిమిల్లి, ఆనందపురం, సుబ్బారావుపేట, మూలపేట, ఉనికిలి వంటి గ్రామాలు నీట మునిగాయి. కైకలూరు మండలంలో పెంచికలమర్రు, శృంగవరప్పాడు, కొట్టాడ, పందిరిపల్లిగూడెం, గోకర్ణపురం, పల్లెపాలెం వంటి గ్రామాలకు నీరు చేరింది. ఇప్పటికే కైకలూరు నుంచి ఏలూరు రహదారిపై రాకపోకలు నిషేధించారు. ఆలపాడు నుంచి సర్కారు కాల్వ మీదుగా పెద్దింట్లమ్మ దేవస్థానం రోడ్డు, శృంగవరప్పాడు గ్రామం నుంచి పైడి చింతపాడు మీదుగా ఏలూరు చేరే రోడ్డుపై రాకపోకలు నిలుపుదల చేశారు.

నీట మునిగిన పంటపొలాలు
కైకలూరు నియోజకవర్గంలో పలు మండలాల్లో డ్రెయిన్లు, కాల్వలు పొంగిపొర్లడంతో పొలాలు సైతం ముంపు బారిలో పడ్డాయి. ప్రధానంగా ముదినేపల్లి మండలంలో పెదగొన్నూరు, వడాలి, చినపాలపర్రు, కోడూరు, వణుదుర్రు, దేవపూడి, ఉంగుటూరు, వాడవల్లి గ్రామాల్లో పొలాల్లోకి నీరు చేరింది. కలిదిండి మండలంలో పడమటిపాలెం, సున్నంపూడి, తాడినాడు, చినతాడినాడ, పల్లెపాలెంలో ఉప్పుటేరు నీరు కారణంగా చెరువులు, పొలాలు దెబ్బతిన్నాయి. డ్రెయిన్లు పొంగడంతో కైకలూరులో కైకలూరు – గోపవరం, తామరకొల్లు – వేమవరప్పాడు, వరహాపట్నం – ఆరుతెగళపాడు రహదారుల్లో రాకపోకలు నిలిచాయి. తక్షణం ఇలాంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



మండవల్లి మండలం మణుగునూరులంక వద్ద నీట మునిగిన ఇల్లు



పెద ఎడ్లగాడి వద్ద ఉధృతంగా ప్రవహిస్తోన్న నీరు

జ్వరంతో బాధపడుతున్నాం



గ్రామంలోకి వరద నీరు చేరి **పది రోజులైం**ది. మా **ఇంటిలో అందరి**కీ జ్వరాలు **వచ్చాయి. చిన్న** మాత్రలు **ఇచ్చారు. మా** గ్రామం చుట్టూ **నీరే ఉంది. తిన్నా**మా? లేదా? అని అధికారులు **అడగటం లేదు**. ఇంతవరకు మాకు ఎలాంటి **సాయం అందలే**దు. మా గ్రామానికి వచ్చి మాకు **ఏం కావాలి అని** అడిగే వారే లేరు. ఇప్పటికైనా **ప్రభుత్వం ఆదుకో**వాలి.
– **బలే వెం**కట పెద్దింట్లమ్మ, పెనుమాకలంక

నిత్యావసరాలు అందించలేదు



వరదలు వచ్చినప్పటినుంచి కూలి పనులు లేవు. పనులకు వెళ్తేనే కడుపునిండేది. అలాంటిది పది రోజులుగా మాకు పనులు లేవు. అందరం ఇబ్బంది పడుతున్నాం. నిత్యాసరాలు పంపుతామని చెబుతున్నారు. పంపడం లేదు. ప్రభుత్వం ఆదుకోపోతే మాకు గతేంటి. ఇప్పటికైనా సరుకులు అందించాలి.
– ఘంటసాల కార్తీక్, పెనుమాకలంక

తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి



చదలవాడ నాగరాణి, జిల్లా కలెక్టర్

భీమవరం(ప్రకాశంచౌక్): ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద మొదటి హెచ్చరిక జారీ చేశామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. భద్రాచలం ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు అధికంగా రావడంతో ధవళేశ్వరం మీదగా వశిష్ట గోదావరికి అధికంగా నీరు వచ్చి చేరిందని తెలిపారు. మంగళవారం అర్ధరాత్రికి ధవళేశ్వరం వద్ద రెండో హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో వశిష్ట గోదావరికి వరద మట్టం పెరుగుతుందని, లంక గ్రామాలు, పరివాహక, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప బోట్ల ద్వారా రాకపోకలు సాగించవద్దని హెచ్చరించారు. గోదావరి కట్ట బలహీనంగా ఉన్న ప్రదేశాలను గుర్తించి పటిష్ట పరచాలని ఆదేశించారు. అవసరమైన ఇసుక బస్తాలు, వెదురు బొంగులు, తడికలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. తాగునీరే, నిత్యావసరాలకు ఇబ్బంది లేకుండా ముందే ఏర్పాట్లు చేసుకోవాలని పంచాయతీరాజ్, సివిల్ సప్లయిస్ అధికారులకు సూచించారు. గర్భిణులు, నవజాత శిశువుల తల్లులను ముందుగానే ప్రభుత్వ హాస్పిటల్స్‌కు తరలించాలని తెలిపారు. పాము కాటు తదితర మందులను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని డీఎం అండ్ హెచ్ ను ఆదేశించారు. విద్యుత్ వైర్లు వేలాడకుండా సరిచేయాలని, ఎక్కడైనా విద్యుత్ కారణంగా ప్రమాదం సంభవిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తప్పని పరిస్థితుల్లో మాత్రమే విద్యుత్ సరఫరా నిలిపివేయాలని సూచించారు. పారిశుధ్య సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని డీపీఓను ఆదేశించారు. అవసరమైన పునరావాస కేంద్రాలను గుర్తించి, మౌలిక వసతులను పరిశీలించాలని సూచించారు.

పంట నష్టం అంచనాలు సిద్ధం చేయండి

భీమవరం అర్బన్: భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను అంచనా వేసి సత్వరమే నివేదిక అందించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భీమవరం మండలంలోని చినఅమిరం, ఎల్‌వీఎన్ పురం గ్రామాలలో అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పంట నష్టాలను ప్రభుత్వం అందించిన ఫార్మేట్‌లో పూర్తి సమాచారాన్ని పొందుపరిచి నివేదికను జిల్లా కార్యాలయంకు అందించాలన్నారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, వీఆర్‌వో, పంచాయతీ కార్యదర్శి ప్రక్రియలో భాగస్వాములై క్షేత్ర స్థాయిలో రైతులతో కలిసి డేటా కాలమ్ 34లో నమోదు చేసి నివేదిక అందించాలన్నారు. నష్టాలు, అంచనాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. కిక్కిసతో నిండిన బొండాడ డ్రెయిన్‌ను పరిశీలించారు. యనమదుర్రు డ్రెయిన్‌కు రెండో ప్రమాద సూచిక జారీకాక ముందే అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

పొలాల్ని ముంచెత్తిన ఎర్ర కాల్వ



జగన్నాథపురం బాడవలో ముంపులో వరి చేలు



మారంపల్లి బాడవలో నీట మునిగిన వరి చేలు

తాడేపల్లిగూడెం రూరల్: ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో తాడేపల్లిగూడెం మండలంలో ఎర్ర కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మండలంలోని మారంపల్లి, జగన్నాథపురం, మాధవరం గ్రామాల్లోని వరి చేలను ఎర్ర కాలువ నీరు ముంచెత్తింది. ఈ నేపథ్యంలో మారంపల్లి బాడవలో 150 ఎకరాలు, జగన్నాథపురం, మాధవరం బాడవ ఆయకట్టు కలిపి 500 ఎకరాలు నీట మునిగాయి. రెండవ దఫా వరి చేలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరద నీరు లాగినప్పటికీ నాట్లు లేతగా ఉండటంతో కుళ్ళిపోయే అవకాశం ఉందని ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది వరదల కారణంగా ఖరీఫ్‌లో నారు, ఎరువులు, పురుగు మందులకు అధిక పెట్టుబడులు పెట్టాల్సి వచ్చిందంటున్నారు.

ఎర్ర కాల్వలోకి వరద నీరు
జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని కొంగువారిగూడెం కెకెఎం ఎర్రకాలువ జలాశయంలోకి మంగళవారం గంటకు 2,944 క్యూసెక్కుల వరద నీరు చేరుతుంది. డ్యాం గేట్ల ద్వారా గంటకు 3,361 క్యూసెక్కుల వరద నీరు విడిచిపెడుతున్నట్లు ఇరిగేషన్ శాఖ డీఈ రాంబాబు తెలిపారు.

గోదావరి ఉగ్రరూపం

- భద్రాచలం వద్ద 48 అడుగులకు వరద
- కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో నీట మునిగిన రోడ్లు
- బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న అధికారులు
- కడెమ్మ స్లూయిజ్ పోటుతో నీట మునిగిన పొలాలు
- మళ్లీ మునిగిన కనకాయలంక కాజ్‌వే
- నరసాపురంలో వశిష్ట గోదావరికి వరద పోటు

గోదావరి ఉగ్ర రూపం దాల్చుతోంది. ఇప్పటికే జలదిగ్బంధంలో చిక్కుకుని విలవిల్లాడుతున్న ఏజెన్సీ గ్రామాల్లో వరద తీవ్రత మరింత పెరుగుతోంది. మంగళవారం పోలవరం ప్రాజెక్టు నుంచి 10.39 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. వేలేరుపాడు మండలంలోని 29 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం కనకాయలంక కాజ్‌వే నీటమునిగింది. బుధవారం నాటికి గోదావరి ఉధృతి మరింత పెరుగుతుందని అధికారులు అంచనా వేసి ముందస్తు చర్యలకు సన్నద్ధమయ్యారు.

కుక్కునూరు/పోలవరం రూరల్/వేలేరుపాడు/యలమంచిలి/నరసాపురం: గోదావరి మరోసారి ఉగ్ర రూపం దాల్చింది. రెండు రోజుల క్రితం తగ్గినట్టే తగ్గిన వరద మంగళవారం వేగంగా పెరిగింది. సోమవారం మధ్యాహ్నం నుంచి పెరుగుతూ వచ్చిన వరద మంగళవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద 48 అడుగులు దాటింది. దీంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. వరద మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు సీడబ్ల్యూసీ అధికారులు అంచనా వేశారు. పెరిగిన వరదతో మండలంలోని పంటచేలు నీట మునిగాయి. గోదావరి వరద సీతారామ నగరం, శ్రీధర్ వేలేరు గ్రామాల మధ్యలో రోడ్డుపైకి చేరడంతో ఆ గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. ఇటు గోదావరి మరింత పెరగనుందన్న హెచ్చరికల నేపథ్యంలో మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నీట మునిగిన పొలాలు
కడెమ్మ స్లూయిజ్ నుంచి వరద నీరు ఎగదన్ని పోలవరం ప్రాంతంలోని పొలాలు ముంపునకు గురయ్యాయి. వరద పెరుగుతుండటంతో ఈ నీరంతా ఎప్పటికి తగ్గుతుందో అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాట్లు వేసిన పొలాలు కుళ్ళిపోతాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

వరద పరిస్థితిపై కలెక్టర్ సమీక్ష
భద్రాచలం వద్ద గోదావరికి రెండో ప్రమాద హెచ్చరిక నేపథ్యంలో వరద ప్రభావిత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను సూచించారు. వేలేరుపాడు మండలంలో గోదావరి వరదల కారణంగా ముంపునకు గురయ్యే తాట్కూరుగొమ్ము గ్రామాన్ని మంగళవారం కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో వరద పరిస్థితిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి ఎక్కువగా ఉందని, వరద ప్రాంతంలో ఎలాంటి ప్రాణ నష్టం కలగకుండా లోతట్టు ప్రాంతాల ప్రజలందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వృద్ధులు, చిన్న పిల్లలు, విభిన్న ప్రతిభావంతులను సురక్షిత ప్రాంతాలకు తప్పనిసరిగా తరలించాలన్నారు. గర్భిణులను దగ్గరలోని పీహెచ్‌సీలకు తరలించాలన్నారు. కాజ్‌వే, కల్వర్టుల వద్ద ఎలాంటి రాకపోకలు లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక అధికారులు వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తగు చర్యలు తీసుకోవాలన్నారు.

మళ్లీ మునిగిన కాజ్‌వే
గోదావరి మళ్లీ ఉగ్రరూపం దాల్చింది. కనకాయలంక వద్ద మళ్లీ కాజ్ వే నీట మునిగింది. కాజ్ వే సోమవారం సాయంత్రమే వరద నుంచి బయటపడింది. 24 గంటలు గడవక ముందే మళ్లీ మునిగింది. జూలైలో సుమారు 22 రోజుల పాటు కాజ్ వే నీట మునిగింది. ఈ ఏడాది మూడోసారి కాజ్ వే మునగడంతో కనకాయలంక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నిత్యావసర సరుకులు ఇచ్చినా అవి నాలుగు రోజులు వస్తున్నాయని కనకాయలంక ప్రజలు వాపోతున్నారు.

పంటు రాకపోకలు నిలిపివేత
నరసాపురంలో వశిష్ట గోదావరి నీటిమట్టం సాయంత్రానికి పెరిగింది. ఎగువప్రాంతం నుంచి భారీగా వరదనీరు వచ్చి చేరుతుండటంతో మళ్లీ నీటిమట్టం పెరిగింది. బుధవారం నాటికి ఇంకా నీటిమట్టం పెరిగే అవకాశం ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. నరసాపురం ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్ గోదావరి పరిస్థితి పరిశీలించారు. మాధవాయిపాలెం రేవులో పంటు రాకపోకలను నిలిపివేశారు.



కుక్కునూరు: గ్రామ శివారు వరకు వచ్చిన గోదావరి వరద



పోలవరం: గోదావరి ఎగపోటు నీటితో ముంపునకు గురైన పొలాలు



వేలేరుపాడు: సురక్షిత ప్రాంతాలకు వరద ప్రాంత ప్రజలు



యలమంచిలి: కనకాయలంక వద్ద వరదలో కాజ్‌వే దాటుతున్న విద్యార్థులు

క్లుప్తంగా

తణుకులో దారి దోపిడీ

తణుకు: తణుకు డీమార్ట్ సమీపంలో ఒక వ్యక్తిపై దారి దోపిడి చేసి బంగారం, నగదు, సెల్‌ఫోన్ అపహరించుకుపోయిన ఘటనపై తణుకు పట్టణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పట్టణ ఎస్సై కె.చంద్ర శేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గణపవరం మండలం సరిపల్లి గ్రామానికి చెందిన తోట సత్తిపండు, తోట పాండు, తోట శ్రీను, గంటా కేశవ కారులో సోమవారం రాత్రి రాజమండ్రి నుంచి తణుకు మీదుగా గణపవరం వెళుతున్నారు. ఈ క్రమంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి తణుకు డీమార్ట్ సమీపంలో కారును అడ్డగించారు. తమను కారుతో ఢీకొట్టబోయారంటూ వారితో వాదనకు దిగారు. పోలీసు స్టేషన్‌కు వెళదామని వారిలో తోట సత్తిపండు అనే వ్యక్తిని బైక్‌పై ఎక్కించుకుని కారులోని వ్యక్తులకు దొరకకుండా నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లారు. అక్కడ సత్తిపండుపై ఇనుప రాడ్‌తో దాడి చేసి అతని వద్ద మూడు కాసుల బంగారు చైన్, రూ.50 వేలు నగదు, సెల్‌ఫోన్ లాక్కుని పరారయ్యారు. బాధితుడు సత్తిపండు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ వివరించారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

అటవీ సంపద తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

టి.నరసాపురం: అటవీభూమిలోని పంటను తరలిస్తున్న వ్యక్తిపై అటవీశాఖ అధికారులు మంగళవారం కేసు నమోదు చేశారు. చింతలపూడి అటవీశాఖ అధికారి సురేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అల్లంచర్ల కొత్తగూడెం పంచాయతీకి చెందిన మన్నెంపల్లి సురేష్ 20 ఏళ్ల క్రితం తన పొలంతోపాటు పక్కనే ఉన్న అటవీభూమిలో రెండు వరుసలు ఆయిల్‌పామ్ మొక్కలు నాటాడన్నారు. అటవీ భూమిలోని మొక్కల ఫలసాయాన్ని సురేష్ ట్రాక్టర్‌పై తరలిస్తుండగా ట్రాక్టర్‌ను సీజ్‌చేసి సురేష్‌పై కేసునమోదు చేసినట్లు అటవీశాఖాధికారి తెలిపారు. గతంలో కూడా ఆయిల్‌పామ్ గెలలను సీజ్ చేసి అటవీభూమిలోకి రావొద్దని హెచ్చరించినా మంగళవారం మరోసారి అయిల్‌పామ్ గెలలు తరలించడంతో అతనిపై కేసునమోదు చేసినట్లు చెప్పారు.

వరద ఉద్ధృతితో అతలాకుతలం

- ముంపునకు గురైన పంట పొలాలు
- లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయం

ఆకివీడు: కొల్లేరు వరద ఉద్ధృతితో ఆకివీడు మండలం అతలాకుతలమైంది. వేల ఎకరాల్లో పంట నీటమునగగా, లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. వరద ఉద్ధృతి మరింత పెరిగితే ఉప్పుటేరు, కొల్లేరు తీర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు నీట మునిగే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని దుంపగడప, మందపాడు, సిద్ధాపురం, చినమిల్లిపాడు, అప్పారావుపేట, చినకాపవరం, చెరుకుమిల్లి తదితర గ్రామాల్లోకి నీరు చొచ్చుకురాకుండా మట్టి మూటలతో అడ్డుకట్టలు వేస్తున్నారు. ఇప్పటికే సిద్ధాపురం, చినమిల్లిపాడు, గుమ్ములూరు, ఆకివీడు తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి అక్కడక్కడా నీరుచొచ్చుకువచ్చింది. మండలంలోని 2 వేల ఎకరాల్లో పంట నీట మునిగి కుళ్లిపోయే దశకు చేరుకోగా మరికొన్ని చోట్ల వరి చేలల్లో ఇంకా భారీగా నీరు నిలబడి ఉంది. ఇప్పటికే ఈ ప్రాంతంలోని వీరమల్లు నగర్ కాలనీవాసులను పునరావాస కేంద్రాలకు తరలించారు. స్థానిక సమతానగర్ సైతం నీట మునుగుతోంది. చినకాపవరం డ్రెయిన్ పొంగి ప్రవహించడంతో సమీప ఆయకట్టు, లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. డ్రెయిన్ ఆక్రమణలకు గురికావడంతో నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. దీనివల్ల కోళ్లపర్రు వంతెనపైకి నీరు చొచ్చుకువచ్చింది. మండలంలోని అన్ని పంట కాల్వలు, మురుగు కాల్వలు పొంగి ప్రవహిస్తున్నాయి.



ఆకివీడు: చినమిల్లిపాడులో పంట కాల్వకు పడిన గండి



గణపవరం: పొలాల ముంపు వివరాలను జేసీ రాహుల్‌కు వివరిస్తున్న ఏవో ప్రసాద్



ఆకివీడు: ఆర్‌అండ్‌బీ వంతెన వద్ద 2.50 మీటర్ల ఎత్తులో ఉప్పుటేరు నీటి మట్టం

చెరువుల్ని తలపిస్తున్న పొలాలు

కొల్లేరు వరద ఉద్ధృతికి పంట పొలాలు చెరువుల్ని తలపిస్తున్నాయి. కొల్లేరు తీర ప్రాంతంలో పొలాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. మండలంలోని చినమిల్లిపాడు గ్రామంలో కొల్లేరు తీరంలో ఉన్న 36 ఎకరాల వరి పంట రెండు రోజుల క్రితం ముంపునకు గురికాకుండా రైతులు అడ్డుకట్ట వేసుకున్నారు. సోమవారం రాత్రికి అడ్డుకట్టను తెంచుకుని ముంపునీరు వరి పొలాల్ని ముంచేసింది. తీరంలోని ఏడు అడుగుల ఎత్తు గట్లున్న రొయ్యల చెరువులు, చేపల చెరువులు సైతం ముంపునకు గురవుతున్నాయి.

ఉద్ధృతంగా ఉప్పుటేరు

ఉప్పుటేరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. కొల్లేరు సరస్సు నుంచి భారీగా నీరు ఉప్పుటేరులోకి ప్రవేశించి దిగువ ప్రాంతం సముద్రంలోకి చొచ్చుకుపోతోంది. ప్రస్తుతం ఉప్పుటేరులో 12 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఆకివీడు ఆర్‌అండ్‌బీ వంతెన వద్ద మంగళవారం నాటికి 2.50 మీటర్ల ఎత్తులో ఉప్పుటేరు ప్రవహిస్తోంది. మరో రెండు మూడు రోజుల వరకూ ఉప్పుటేరు నీటి మట్టం పెరిగే అవకాశం ఉందని డ్రెయినేజీ శాఖ అధికారులు చెబుతున్నారు.

1082 ఎకరాలు నీట మునక

గణపవరం: ఇటీవలి భారీ వర్షాలు, వరదల కారణంగా గణపవరం మండలంలో 1082 ఎకరాలు ముంపునకు గురయ్యాయని, 446 మంది రైతులు నష్టపోయారని మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్ తెలిపారు. పంట నష్టం వివరాలను మండలానికి వచ్చిన జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డికి వివరించారు. నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వ సహాయం అందేలా జాబితాలను పారదర్శకంగా తయారు చేయాలని జేసీ ఆదేశించారు.

జలదిగ్బంధంలో ఉనికిలి

మండవల్లి: మండవల్లి మండలంలోని ఉనికిలి గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఎస్సీ కాలనీలోని సుమారు 40 ఇళ్లల్లోకి నీరు ప్రవేశించి, గృహస్తులు నానా అవస్థలు పడుతున్నారు. బుడమేరు నుంచి నీరు కొల్లేరులో కలవడం వల్ల ఇక్కడ నీరు కొల్లేరుకు చేరే అవకాశం లేకపోడంతో సమస్యలు ఎదురౌతున్నాయి. చేపల చెరువుల యజమానులు నీరు బయటకు వదిలేస్తుండంతో రోడ్లపై నీరు బాగా పెరిగి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ గ్రామానికి చెందిన పలు కుటుంబాల వారు 10 రోజుల నుంచి పునరావాస కేంద్రాల్లోనే కాలం గడుపుతున్నారు.



ఆకివీడు: సిద్ధాపురంలో రోడ్డుపై ముంపునీరు



మండవల్లి: జలదిగ్బంధంలో ఉనికిలి ఎస్సీ కాలనీ



ఆకివీడు: అయిభీమవరం, మందపాడు గ్రామాల్లో నీట మునిగిన పొలాలు

పెనుగొండ వాసవీమాత ఉపాలయంలో చోరీ



పెనుగొండ వాసవీ ఆలయంలో వివరాలు అడిగి తెలుసుకొంటున్న అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ

పెనుగొండ: స్థానిక నగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలోని ఉపాలయమైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. స్వామివారి నాలుగు కిలోల అలంకరణ వెండి వస్తువులు, రెండున్నర కాసుల బంగారు అభరణాలు చోరీకి గురయ్యాయి. మంగళవారం ఉదయం ఉపాలయ అర్చకులు కోట గిరిధర్ శర్మ పూజాధికాలు నిర్వహించడానికి వచ్చేసరికి ఆలయ తలుపు తెరచి ఉండడం, బీరువా తెరచి ఉండడంతో దేవస్థానం అధికారులకు సమాచారం అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గుబ్బల రామపెద్దింట్లురావు చోరీని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని సీఐ నక్కా రజనీకుమార్, ఎస్సై కొప్పిశెట్టి గంగాధర్ పరిశీలించారు. అడిషనల్ ఎస్పీ ఎస్‌బీఎం మురళీకృష్ణ ఆలయానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకొన్నారు. క్లూస్ టీం సభ్యులు ఎం రాజేష్, ఎం వెంకట్రావు ఆలయంలో పలు ప్రదేశాలను పరిశీలించారు. ఆలయ ఈవో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు ఆలయంలోని సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

లోక్‌అదాలత్‌లో బీఎస్ఎన్ఎల్ బకాయిలు పరిష్కరించుకోండి

ఏలూరు (టూటౌన్): ఈనెల 14న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని బీఎస్ఎన్ఎల్ బకాయిల సమస్యలు పరిష్కరించుకోవాలని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ ఎల్ శ్రీను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల సౌకర్యార్థం జిల్లా, మండల న్యాయ సేవాధికార కమిటీ వారిచే జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, తాడేపల్లిగూడెం, నిడదవోలు, కొవ్వూరు, తణుకు, భీమవరం, నరసాపురం పరిధిలోని లోక్‌అదాలత్ కోర్టుల్లో టెలిఫోన్ బకాయిలను పరిష్కరించుకోవచ్చునన్నారు. లోక్‌అదాలత్ కోర్టుల ద్వారా నోటీసులు పొందిన వినియోగదారులు తమ పరిధిలోని లోక్ అదాలత్ నందు హాజరై బకాయిలను పరిష్కరించుకోవాల్సిందిగా జీఎం కోరారు.

విజయవాడ వరదలపై విచారణ జరిపించండి

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ

కొయ్యలగూడెం: లక్షలాది మంది విజయవాడ ప్రజలు వరద బాధితులుగా మారడానికి పరోక్షంగా కారణమని భావిస్తున్న ఏపీ నీటిపారుదల శాఖాధిపతులపై విచారణ చేయాలని ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని రాష్ట్ర కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షుడు ఏఆర్కే హనుమంతరావు కోరారు. ఈమేరకు ప్రధాన న్యాయమూర్తికి విన్నవిస్తూ ఆయన ఒక లేఖ రాశారు. ఆగస్టు 31న నీటిపారుదల శాఖ డీఈ నాయక్ బుడమేరు వరద ఉద్ధృతిపై స్థానిక తహసీల్దార్, రాష్ట్ర ఇరిగేషన్ హెడ్‌లకు సమాచారం అందించారన్నారు. సాయంత్రం 4 గంటలకు బుడమేరు గేట్లు ఎత్తే అవకాశం ఉందని నాయక్ సాక్షి టీవీకి కూడా సమాచారం ఇచ్చారన్నారు. బుడమేరు గేట్లు ఎత్తడం ద్వారా విడుదలైన వరద నీరు విజయవాడ ప్రాంతానికి వెళ్లేందుకు దాదాపు 10 గంటల సమయం పడుతుందని డీఈ స్పష్టంగా చెప్పారన్నారు. అయితే ఉన్నతాధికారులు సరిగా స్పందించలేదని, వారు తక్షణమే స్పందించి టీవీ ఛానెళ్ల ద్వారా, పోలీసు బలగాల ద్వారా ప్రజలకు సమాచారం అందిస్తే వారు సురక్షిత ప్రాంతాలకు చేరుకునే అవకాశం ఉండేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల విజయవాడలో లక్షల కుటుంబాలు వరద బాధితులుగా మారాయని ప్రజలు సైతం భావిస్తున్నారన్నారు. డీఈ నాయక్ ప్రకటన ఆధారంగా విజయవాడ వరదలపై విచారణ చేయాలని హనుమంతరావు కోరారు. వాస్తవాలను ప్రజల ముందు ఉంచడానికి, సరైన చర్యలు తీసుకోవడానికి, ప్రభుత్వానికి ఉత్తమమైన సూచనలను అందించడానికి విచారణ దోహదపడుతుందని హనుమంతరావు పేర్కొన్నారు.

కళాశాల బస్సు అదుపు తప్పి విద్యార్థులకు గాయాలు



పాలకోడేరులో పూడుకుపోయిన పంట బోదెలోకి దూసుకెళ్లిన శ్రీ చైతన్య కాలేజీ బస్సు



గాయపడ్డ విద్యార్థిని పీహెచ్‌సీలోకి తీసుకెళ్తున్న దృశ్యం



పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

పాలకోడేరు: ఓ ప్రైవేట్ కళాశాల బస్సు అదుపు తప్పి అందులో ప్రయాణిస్తున్న విద్యార్థులకు గాయాలయ్యాయి. వివరాల ప్రకారం భీమవరంలోని చినఅమిరానికి చెందిన శ్రీ చైతన్య జూనియర్ కళాశాల బస్సు మంగళవారం ఉదయం మోగల్లు నుంచి విద్యార్థులను ఎక్కించుకుని కళాశాలకు వెళ్తు పాలకోడేరు వద్ద డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా పూడుకుపోయిన పంటబోదెలోకి రోడ్డు పక్కకు దూసుకుపోయింది. బస్సులో 20 మంది విద్యార్థులు ఉండగా ముందు కూర్చున్న విద్యార్థులు 11 మందికి స్వల్ప గాయాలయ్యాయి. మాముడూరు దంతిపల్లి, ఆరవల్లి, లక్ష్మీనారాయణపురం, మోగల్లు గ్రామాలకు చెందిన భవ్య శ్రీ,వర్షిని, యామిని, మౌనిక లక్ష్మి, అమృత, వర్ష, మాధవి, నవ్య, మోహన్, నికిత అక్షయ, మాధురికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా మోగల్లుకు చెందిన విద్యార్థిని సానాయిల దివ్యసుధకు కాలు, చెయ్యి ఫ్రాక్చర్ అయ్యింది. గాయపడ్డ విద్యార్థులను హుటాహుటిన పాలకోడేరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, ప్రాథమిక చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన దివ్యసుధను భీమవరం ప్రభుత్వాసుపత్రికి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విద్యార్థులను తహసీల్దార్ నడింపల్లి భారతి విజయలక్ష్మి, పోలీసులు, కళాశాల యాజమాన్యం, ప్రజాప్రతినిధులు పరామర్శించి సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. దివ్యసుధ ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్ హరిబాబు తెలిపారు.

ప్రచార ఆర్భాటాలకే ప్రభుత్వం పరిమితం

కొయ్యలగూడెం: తుపాను వలన కలిగిన నష్టాన్ని అనుభవిస్తున్న ఆదివాసీలను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆదివాసీ భారత్ మహాసభ ఆంధ్ర రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు మంద్రు రామిరెడ్డి విమర్శించారు. మంగళవారం కన్నాపురం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో కమిటీ నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. తుపాను ప్రభావం వల్ల అనేక ఆదివాసి గ్రామాల్లో కనీస వసతుల సదుపాయం ప్రభుత్వం కల్పించలేదని దీంతో ఆదివాసీలు అనారోగ్యం పాలై దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గోదావరి ఉప్పొంగడం వల్ల ఆహారం లేక వరద బాధితులు అలమటిస్తున్నారని అయితే ప్రభుత్వం ప్రకటనలకు, ప్రచార ఆర్భాటాలకు మాత్రమే పరిమితమైందని విమర్శించారు. వాగుల ఉధృతి వల్ల వరద ఉధృతిలో సుమారు పది మంది గిరిజనులు ప్రాణాలు కోల్పోయారని వారికి ఇప్పటివరకు నష్టపరిహారం ప్రకటించలేదని అన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేలు, ప్రాణాలు కోల్పోయిన వారికి రూ.10 లక్షలు నష్టపరిహారం ప్రకటించాలన్నారు. బుడమేరు ముంపు లాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని వరద ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన వైద్య శిబిరాలు రేయింబవళ్లు నిర్వహించాలని కోరారు.

నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన



నల్లబ్యాడ్జి ధరించి రోగులను పరీక్షిస్తున్న పిప్పర పీహెచ్‌సీ వైద్యురాలు ప్రియాంక

గణపవరం: తమ వైద్యవృత్తికి తీరని అన్యాయం చేసే జీవో నం.85 ను రద్దుచేయాలని కోరుతూ పీహెచ్‌సీ వైద్యులు మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రాష్ట్రవ్యాప్త పీహెచ్‌సీ వైద్యుల సంఘం పిలుపుమేరకు గణపవరం, పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కె.ప్రియాంక నల్లబ్యాడ్జీలు ధరించి రోగులకు వైద్య సేవలు అందించారు. తమ మూడేళ్ల సర్వీసుకు నష్టం కలిగిస్తున్న జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అకస్మాత్తుగా జీవోను మార్చడం వలన తమ వృత్తి ప్రగతికి తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. జీవో 85ను రద్దుచేయాలని రెండు నెలలుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

భీమవరం: అదనపు కట్నం కోసం భర్త రాంబాబు, అత్త వేధిస్తున్నారని భీమవరం 39వ వార్డుకు చెందిన ఎస్.అంబిక మంగళవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. 2102లో తనకు వివాహమైందని, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్సై రెహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కొత్త రోడ్లు దేవుడెరుగు.. గోతులైనా పూడ్చండి



వన్‌టౌన్ కొత్త వంతెన సెంటర్‌లో దుస్థితి



ఏలూరు తంగెళ్ళమూడి నెహర్‌మజీద్ వద్ద ఇలా..



ఏలూరు కండ్రికగూడెం సెంటర్‌లో పరిస్థితి



గోతులతో ప్రమాదకరంగా మారిన ఏలూరు ఆర్‌ఆర్‌పేట రోడ్డు

గత కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏలూరు నగరంలోని రోడ్లన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. పెద్ద పెద్ద గోతులతో ప్రధాన రహదారులన్నీ ప్రమాదకరంగా మారాయి. నిత్యం ఏదో ఒకచోట వాహనదారులు ప్రమాదానికి గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. కొత్త రోడ్లు సంగతి దేవుడెరుగు.. కనీసం గోతులైనా పూడ్చండి మహాప్రభో అని అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు



ఛిద్రమైన ఏలూరు అశోక్‌నగర్ సెంటర్ రోడ్డు

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

ఏలూరు టౌన్: మనస్తాపంతో పురుగులమందు తాగి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు రూరల్ మండలం సుంకరవారితోటకు చెందిన తిర్లి కృష్ణకుమారి (38)కి భర్త సుబ్రహ్మణ్యం, ఒక కుమార్తె ఉన్నారు. సుబ్రహ్మణ్యం 3 నెలల క్రితం పనుల నిమిత్తం విశాఖపట్టణం వెళ్లాడు. కుమార్తె ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈనెల 9వ తేదీన ఇంట్లో టిఫిన్ పూరీ చేయమని తల్లి కృష్ణకుమారిని కుమార్తె కోరింది. ఆమె పూరీ చేయకపోవడంతో టిఫెన్ మానేసింది. తల్లికుమార్తెలు ఇద్దరూ మొండిగా ప్రవర్తిస్తూ సాయంత్రం వరకూ ఏమి తినలేదు. దీంతో మనస్థాపానికి గురైన తల్లి కృష్ణకుమారి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా సోమవారం అర్ధరాత్రి మృతి చెందింది. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు రూరల్ ఎస్సై సీహెచ్ దుర్గాప్రసాద్ మంగళవారం ఉదయం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని శవపంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

తల్లిదండ్రులను దైవసమానులుగా చూడాలి



పదాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: తల్లిదండ్రులను ప్రతి ఒక్కరూ దైవసమానులుగా చూడాలని ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని పదాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో 70మంది వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ వృద్ధాప్యంలోని తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని, కన్నబిడ్డలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అరుణకుమారి, హరిణి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ పరమాత్మకు విశేష పూజలు



విశేష అలంకరణలో కృష్ణ పరమాత్మ

తాడేపల్లిగూడెం (టీటీ): శ్రీకృష్ణజన్మాష్టమి, వినాయకచవితి పండుగల ముగింపు సందర్భంగా మంగళవారం స్థానిక రామచంద్రరావుపేటలోని కృష్ణ యోగ ధ్యాన మందిరంలో నిత్య అర్చనలు, అనంతరం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు. మందిర అధ్యక్ష, కార్యదర్శులు కొర్లేపర పాండురంగారావు, ఇందుకూరి మోహన్‌రాజులు పర్యవేక్షించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీటీ): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. కడకట్ల పట్టణ ఆరోగ్య కేంద్రం వారిచే ఎల్ఈఎఫ్ ఏరియాలో సబ్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు జరిగాయి. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమ లార్వా బ్రీడింగ్ ప్రదేశాలను గుర్తించాలని, మునిసిపల్ శానిటేషన్ వారి సహకారంతో కీటక నియంత్రణలు చేపట్టడం ద్వారా మలేరియా, డెంగీ వ్యాధులను అరికట్టవచ్చునని చెప్పారు. జ్వర లక్షణాలు ఉన్నవారికి ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు చేయాలని, ఆరోగ్యాన్ని పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఈ ర్యాలీలో ఆరోగ్య కార్యదర్శి చంద్రకళ, ఆరోగ్య సహాయకులు తాతారావు, ఆశాలు అనురాధలు పాల్గొన్నారు.

జీవో 85ను తక్షణమే రద్దు చేయాలి



వేల్పూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు

తణుకు టౌన్: వైద్యుల పాలిట గుదిబండగా మారిన జీవో 85ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ తణుకు మండలంలోని పీహెచ్‌సీలు, సామాజిక వైద్యులు మంగళవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలను ధరించి వైద్యులు రోగులకు వైద్య సేవలందించారు. పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీసు కోటాను 30శాతంనుంచి 15శాతానికి కుదిస్తూ ప్రభుత్వం జీవో 85ను జారీ చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ రెండు నెలలుగా పీహెచ్‌సీ వైద్యులు సంబంధిత అధికారులకు విన్నవించుకున్నా వారి విజ్ఞప్తిని ఖాతరు చేయకపోవడంతో వైద్యుల సంఘం ఆందోళన బాట పట్టింది. కోవిడ్ సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి వైద్య సేవలందించిన వైద్యులకు తీరని అన్యాయం జరుగుతుందని వేల్పూరు పీహెచ్‌సీ వైద్యులు కిషోర్, సాయి భవానీలు తెలిపారు.

12న అలంపురంలో ఉచిత వైద్యశిబిరం

పెంటపాడు: మండలంలోని అలంపురం వెంకటరమణసేవాఆసుపత్రిలో ఈనెల 12న ప్రత్యేక వైద్యులు రానున్నట్లు ట్రస్టు ప్రతినిధి కొలనువాడ పెదకృష్ణ ఒక ప్రకటన లో తెలిపారు. రాజమండ్రి రాజానగరంకు చెందిన కార్డియాలజీ, గైనకాలజీ, చిన్నపిల్లల వ్యాధుల నిపుణులు, అంకాలజీ, జనరల్ మెడిసన్ వైద్యులు పరీక్షలు చేస్తారన్నారు. పరిసర గ్రామాల రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఊరేగింపులు.. నిమజ్జనాలు



శాలిపేట రామాలయం వద్ద గోల్డ్ గణేష్ యూత్ వినాయక చవితి మహోత్సవాలు



రజకపేటలో బాల గణేష్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో త్రిశూల గణపతి స్వామి వారికి పూజలు



యాగర్లపల్లిలో గణపతి మహోత్సవాలలో గరికపూజలో పాల్గొన్న ఉత్సవ కమిటీ సభ్యులు



అత్తిలి మండలం బల్లిపాడులో గణపతి నిమజ్జన ఊరేగింపు ఉత్సవ దృశ్యం



పెంటపాడు: మిడ్‌లెవెల్ కాలువలో నిమజ్జనోత్సవం

తాడేపల్లిగూడెం (టీటీ): వినాయక చవితి వేడుకల్లో భాగంగా నాల్గోరోజైన పలు ప్రాంతాల్లో భారీ ప్రతిమలను, ఊరేగించి సమీప పంట కాలువలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. యాగర్లపల్లిలోని శ్రీ సిద్ది వినాయక నవరాత్రి వేడుకలు సందర్భంగా గణపతి హోమం, ప్రత్యేక గరిక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. శాలిపేట రామాలయం వద్ద గోల్డ్ గణేష్ యూత్ వారిచే అంగరంగ వైభవంగా మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అదే విధంగా రజకపేటలో బాల గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ యూత్ వారి ఆధ్వర్యంలో వినాయక చవితి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. యూత్, మహిళలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

పెంటపాడు: వినాయక చవితి పురస్కరించుకొని పలు గ్రామాల్లో మంగళవారం నిమజ్జనోత్సవాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. పెంటపాడు కుమ్మరిపుంత ప్రాంతంలో సైలెంట్ బాయ్స్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుని ఊరేగించి మిడ్‌లెవెల్ కాలువలో నిమజ్జనం చేశారు. ఆంజనేయస్వామివారి ఆలయం వద్ద ప్రతిష్ఠించిన విజయగణపతి స్వామికి ప్రత్యేక గరికపూజలు జరిగాయి. కె. పెంటపాడు, విప్పర్రు, ప్రత్తిపాడు మీనవిల్లూరు, కొండేపాడు తదితర గ్రామాల్లో ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఊరేగింపు ఉత్సవాలు, నిమజ్జనోత్సవాలు జరిగాయి.

అత్తిలి: మండలంలో పలు గ్రామాలలో మంగళవారం గణపతి నిమజ్జనాలు జరిపారు. అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో కొత్తచెరువుగట్టుపై ఉన్న శ్రీవినాయక స్వామి ఆలయం వద్ద నెలకొలిపిన గణపతి ప్రతిమను పుష్పాలతో అలంకరించిన వాహనంపై ఉంచి మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం చెరువులో గణపతి ప్రతిమను నిమజ్జనం చేశారు.

విజయవాడ వరద ప్రభుత్వ వైఫల్యమే

- చంద్రబాబుది ప్రచార ఆర్భాటమే..
- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే 50మంది మృతి
- మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ మంత్రి

తణుకు అర్బన్: వరదలు వస్తాయని ముందుగా హెచ్చరికలు ఉన్నప్పటికీ సరైన జాగ్రత్తలు తీసుకోవడంలోరాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. విజయవాడ వరద కారణంగా 50మంది మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ మరణాలు సంభవించాయని అభిప్రాయపడ్డారు. చంద్రబాబు కరకట్టపై ఉన్న తన నివాసంతోపాటు తన అనుయాయుల ఇళ్లు, ఆస్తులను కాపాడుకునే ఉద్దేశ్యమే విజయవాడ ముంపుబారిన పడిందనే విషయం యావత్ దేశమంతా చర్చించుకుంటుందని దుయ్యబట్టారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాజమండ్రి పుష్కరాల్లో 39 మందిని పొట్టనపెట్టుకున్నారని, నేడు మరల అధికారంలోకి రాగానే నరమేధాన్ని చవిచూడాల్సి వచ్చిందన్నారు. చనిపోయినవారే కాకుండా ఇప్పటికీ చాలామంది గల్లంతైపోయిన పరిస్థితి చాలా దారుణమని ఆరోపించారు. విజయవాడ ముంపు బాధితులు వివిధ ప్రసార సాధనాల ద్వారా చంద్రబాబు అసమర్థ పాలనను దుయ్యబట్టిన తీరును దేశమంతా చూసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ముప్పును మాకు చెప్పి ఉంటే మాకుమేమే దూరప్రాంతాలకు వెళ్లి తల దాచుకునే వారమని బాధితులు చెబుతున్న తీరుతో పాటు చిన్నారులు, వృద్ధులుపడ్డ కష్టాలు వర్ణనాతీతమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్ మహమ్మారి మరణమృదంగం మోగించిన సమయంలో కూడా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిన్న వయసైనప్పటికీ ఎంతో అనుభవంతో వ్యవహరించి మిగిలిన రాష్ట్రాల కన్నా ప్రాణనష్టం తగ్గించడంలోను వ్యాక్సిన్‌లు అధికంగా తీసుకురావడంలో సఫలీకృతుడయ్యారని గుర్తుచేశారు.

విపత్తును కూడా క్యాష్ చేసుకుంటున్న చంద్రబాబు

భారీ వర్షానికి బుడమేరు నుంచి వచ్చిన వరద నీటితో విజయవాడ మునిగిపోయి ప్రజలకు కనీస వసతులు అందించలేకపోయి విఫలం చెందిన చంద్రబాబు ప్రభుత్వం చందాలతో దందాలకు దిగుతుందని ఎద్దేవా చేశారు. బాధితులను పూర్తిస్థాయిలో ఆదుకోకుండా ప్రెస్‌మీట్‌లతో సాయం చేయాలని అడుగుతూ విరాళాలు సేకరించే పనిలో చంద్రబాబు నిమఘ్నమయ్యారని విమర్శించారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో ఏం జరిగినా ఆయన బాగుకే వస్తుందన్నట్లుగా ఉందని ఇందుకు ఉదాహరణగా భారీగా విరాళాలు సేకరించడమేనని ఆరోపించారు. కోవిడ్ సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ ఒక్కరిని కూడా విరాళాలు ఇవ్వాల్సిందిగా కోరలేదని గుర్తుచేశారు. ఏదిఏమైనా చంద్రబాబు ఘోర తప్పిదంతోనే విజయవాడవాసుల జీవితాలు చెల్లాచెదురైపోయి చెట్టుకొకరు, పుట్టకొకరు అయిపోయారని అన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

అత్తిలి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషణ కిట్లను గర్భవతులు వినియోగించుకోవాలని ఐసీడీఎస్ తిరుపతిపురం సెక్టార్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి అన్నారు. పోషకాహార మాసోత్సవాలలో భాగంగా మంగళవారం అత్తిలి మండలం బల్లిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లీ, బిడ్డ రోగాల నుంచి రక్షణ పొందుతారన్నారు. ప్రస్తుతం సీజనల్ జ్వరాలు వస్తున్నందున కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తీసుకునే ఆహారంలో మిల్లెట్స్ ఉండే విధంగా చూసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం స్వప్నశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు డి నర్సవేణి, సీహెచ్ లక్ష్మీదేవి, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

తణుకులో పౌష్టికాహార మాసోత్సవాలు



అత్తిలి: బల్లిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి

తణుకు: పట్టణంలోని స్థానిక పదో వార్డు రామాలయం వద్ద మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో ప్రమోదిని ఆదేశాలు మేరకు తణుకు సెక్టార్ సూపర్‌వైజర్ అరుణ కుమారి పాల్గొని గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, రక్తహీనత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. మెప్మా టీఎల్ఎఫ్ వెంకటలక్ష్మి, రత్నకుమారి, అంగన్‌వాడీ టీచర్ పీఎస్‌వీకే పరమేశ్వరి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ప్రయాణం.. నరకం..!

- గోతులతో నిండిన జాతీయ రహదారి
- అవస్థలు పడుతున్న వాహన చోదకులు
- మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి



తేతలి వైజంక్షన్ వద్ద జాతీయరహదారిపై నిలిచిన వర్షపునీరు

తణుకు: జాతీయ రహదారి... వేగవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు నిర్దేశించిన రోడ్డు. ఈ రోడ్డుపై తగినంత వేగంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. అయితే నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారిపై గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఇటు తాడేపల్లిగూడెం నుంచి దువ్వ, తణుకు, పెరవలి, ఖండవల్లి, అన్నవరప్పాడు, సిద్ధాంతం వరకు రోడ్డుకు ఇరువైపులా ఎక్కడికక్కడ పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ పరిస్థితి తలెత్తింది. గోతుల రహదారిపై ప్రయాణిస్తున్న వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి మరమ్మతులు చేయించకపోవడంతో వాహన చోదకులు గోతులను గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణికులు మరిన్ని అవస్థలు పడుతున్నారు. ఈ గోతులు పెద్దవిగా ఉండటంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

నిర్వహణలో నిర్లక్ష్యం...

వాస్తవానికి జాతీయరహదారిపై నీళ్లు నిలిచిపోకుండా ఎక్కడికక్కడే పక్కాగా ఏర్పాట్లు చేయాల్సి ఉంది. అయితే వాటి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని వాటిపై రాకపోకలు సాగించే ప్రయాణికులు చెబుతున్నారు. తేతలి వైజంక్షన్‌తోపాటు దువ్వ, వెంకయ్య వయ్యేరు పరిధిలోని హైవేపై నీరు నిలిచిపోతోంది. మరోవైపు రోడ్డుకు ఇరువైపులా, డివైడర్ పైనా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. డివైడర్ మధ్యలో పిచ్చిమొక్కల తొలగింపుపై ఉన్న శ్రద్ధ రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ పట్ల చూపడంలేదని పలువురు ప్రయాణీకులు చెబుతున్నారు. దీంతోపాటు చిన్నపాటి వర్షానికే సాధారణ రోడ్లు మాదిరిగానే జాతీయరహదారిపైనా ఎక్కడికక్కడే నీటి గుంతలు దర్శనమిస్తున్నాయి. ఇలా నీరు నిల్వ ఉన్న చోట్ల బురద కూడా చేరి వాహనదారులు జారుతున్నామంటున్నారు.

ఢీకొంటున్న వాహనాలు..

హైవేకు మధ్యలో పెద్ద పెద్ద గోతులు ఉండటంతో వాటిని తప్పించుకుని వెళ్లే క్రమంలో వాహనాలు ఒక దానినొకటి ఢీకొని దెబ్బతింటున్నాయి. మరోవైపు గోతుల్లో పడిన వాహనాలు మరమ్మతులకు గురువుతున్నాయి. దీంతో వేలాది రూపాయలు చేతి సొమ్ము ఖర్చు చేసి వాహనాలను బాగుచేయించుకోవాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. కొన్నిసార్లు వేగంగా వచ్చే వాహనాలు ఈ గోతులను చూసి సడన్ బ్రేక్ వేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఘటనల్లో ద్విచక్ర వాహన చోదకులతోపాటు ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఈ గోతులు నీటితో నిండిపోతున్నాయి. వాహన చోదకులు గమనించకుండా వాటిలో దిగడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. హైవేపై ఏర్పడిన గోతులను పట్టించుకోకపోవడంపై వాహనచోదకులు మండిపడుతున్నారు. మరోవైపు టోల్ టాక్సుల పేరుతో పెద్ద మొత్తంలో వసూళ్లు చేస్తున్నప్పటికీ కనీసం మరమ్మతులు చేపట్టకపోడం విమర్శలకు దారి తీస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గోతులు పూడ్చి వేసి, వాహన చోదకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన అవసరం ఉంది.



తణుకు అయ్యప్పస్వామి గుడి వద్ద రోడ్డు దుస్థితి



గౌతమి సాల్వెంట్ వద్ద రోడ్డు హైవేపై గోతులు



తేతలి జాతీయ రహదారిపై గోతులతో వాహనదారుల అవస్థలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు నీలాద్రిపురం సబ్ స్టేషన్ ఇన్‌చార్జ్ ఏఈ రత్నాకర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. ఆర్అండ్‌బీ రోడ్డు పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని లింగారాయుడిగూడెం గ్రామంలో కోడిపందాలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు రూరల్ ఎస్సై జేవీఎస్ వీ.ప్రసాద్ తన సిబ్బందితో మంగళవారం దాడి చేశారు. ఈ సందర్భంగా నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.1320లు, మూడు కోడికత్తులు, ఒక కోడిపుంజు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై ప్రసాద్ వివరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన

తణుకు టౌన్: క్షణికావేశంలో నిండుజీవితాన్ని ఆత్మహత్యప్రయత్నంతో బలిచేయకూడదని మానశిక వైద్యులు డాక్టర్ కుడారి ఆనంద్ చెప్పారు. మంగళవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా పైడిపర్రు-తేతలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తణుకులోని ప్రియాంక ఆసుపత్రిలో ఆత్మహత్యల నివారణపై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గోప్యం లేకుండా నివారించగలిగే ఈ వ్యాధి గురించి మాట్లాడుకోవడం వలన ఆత్మహత్యలను నివారించవచ్చన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ ఎం బాబూజీరావు, సభ్యులు పాల్గొన్నారు.

ఉద్ధృతంగా యనమదుర్రు



కొండేపాడు, మీనవిల్లూరు గ్రామాల వద్ద పొంగి ప్రవహిస్తున్న యనమదుర్రు

పెంటపాడు: గత వారం రోజులు నుంచి ముసురు వల్ల కురిసిన వర్షంనీటికి యనమదుర్రు డ్రైయన్ పొంగి ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతమైన ఎర్రకాలువగా పిలిచే నందమూరు వద్ద ప్రస్తుతం ఉద్ధృతి కొనసాగుతున్న దృష్ట్యా మండలంలో కాలువ పరివాహక గ్రామాలైనకొండేపాడు, మీనవిల్లూరు, రామచంద్రపురం గ్రామంలో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రెఉడు నెలల క్రితం కురిసిన వర్షం వల్ల ఇక్కడి పొలాలు తీవ్రంగా నీటమునిగాయి. ఇప్పటికైనా రెవిన్యూ యంత్రాంగం స్పందించి పరిస్థితిని సమీక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

భవిత కేంద్రంలో స్వచ్ఛభారత్

తాడేపల్లిగూడెం (టీటీ): పట్టణంలోని భవిత దివ్యాంగుల కేంద్రం ఆవరణలో మంగళవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. వర్షాలు కారణంగా పాఠశాల చుట్టూ ఉన్న కలుపు మొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బి.జ్యోతి, ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువుల యజమానులపై చర్యలు తీసుకుంటాం

తణుకు: పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువుల యజమానులపై చర్యలు తీసుకుంటామని తణుకు పట్టణ సీఐ ఎస్.కొండయ్య హెచ్చరించారు. మంగళవారం తణుకు పట్టణ పోలీసు స్టేషన్‌లో సంబంధిత పశువుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

తాడేపల్లిగూడెం: విద్యార్థి జీవితంలో తెలియని ఎన్నో విషయాలు తెలుసుకోవడానికి గంథ్రాలయాలు ఎంతో ఉపయోగపడతాయని ఏపి నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి అన్నారు. ఏపీ నిట్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను ఎక్కువగా వినియోగించుకుంటున్న విద్యార్థులను ప్రోత్సహించాలనే బిబ్లియోఫిల్ అవార్డును ప్రవేశపెట్టామన్నారు. 2023-24సంవత్సరానికి సంబంధించి అవార్డులను అందజేశారు.

జ్యోతికశ్రీకి మానవత సత్కారం

తణుకు టౌన్: ఇటీవల పారిస్‌లో జరిగిన ఒలింపిక్ క్రీడల్లో భారత్ తరపున పాల్గొన్న తణుకు పట్టణానికి చెందిన క్రీడాకారిణి దండిక జ్యోతికశ్రీని తణుకు మానవత సంస్థ సభ్యులు సత్కరించారు. మంగళవారం తణుకు మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు కఠారి శారదాదేవి ఆధ్వర్యంలో మానవత సంస్థ సభ్యులు జ్యోతికశ్రీని ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా మానవత సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ కే రాధాపుష్పావతి మాట్లాడుతూ జ్యోతికశ్రీ భవిష్యత్‌లో మరిన్ని ఒలింపిక్స్ క్రీడలల్లో పాల్గొని పతకాలతో తణుకు కీర్తిని ప్రపంచ వ్యాప్తం చేయాలని ఆకాంక్షించారు. జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తున్న జ్యోతికశ్రీని మానవత సంస్థ తరపున సత్కరించడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో మానవత సంస్థ తరపున డెల్టా ఇన్ఫోసిస్ సంస్థ అధినేత కె శివానంద్ సౌజన్యంతో రూ. 25 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. మానవత సంస్థ చైర్మన్ వీవీ రామకృష్ణారావు, ఏ సుబ్రహ్మణ్యం, ఆలపాటి సుబ్బారావు, అక్కిన కాశీ విశ్వనాథం, ఏ ప్రసాదరావు, శివన్నారాయణ, ఆర్జి భాస్కరరావు పాల్గొన్నారు.